బిందేశ్వర్ పాఠక్

వైజయంతీమాల బాలి

పద్మ సుబ్రహ్మణ్యం

విజయ్‌కాంత్

మిథున్ చక్రవర్తి

చిరంజీవి, వెంకయ్యకు పద్మవిభూషణ్

బిందేశ్వర్, వైజయంతి మాల, పద్మసుబ్రహ్మణ్యంకు కూడా..

ఫాతిమా బీవీ, మిథున్ చక్రవర్తి, విజయకాంత్ సహా 17 మందికి పద్మభూషణ్

110 మందికి పద్మశ్రీ పురస్కారం

తెలంగాణ నుంచి ఐదుగురి ఎంపిక

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రకటించిన కేంద్రం



న్యూఢిల్లీ, జనవరి 25: ప్రముఖ సినీనటుడు చిరంజీవి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని పద్మవిభూషణ్ పురస్కారం వరించింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం గురువారం పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఈ ఏడాది మొత్తం 132 మందికి పద్మ అవార్డులను ప్రకటించగా.. అందులో ఐదుగురికి పద్మవిభూషణ్, 17 మందికి పద్మభూషణ్, 110 మందికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. అలనాటి నటి వైజయంతి మాల బాలి, సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్, పద్మ సుబ్రమణ్యంలను పద్మవిభూషణ్‌కు కేంద్రం ఎంపిక చేసింది. సుప్రీంకోర్టు తొలి మహిళా న్యాయమూర్తి ఫాతిమా బీవీ, నటులు మిథున్ చక్రవర్తి, విజయకాంత్ తదితరులను పద్మభూషణ్ వరించింది. తెలంగాణకు చెందిన ఐదుగురు పద్మ అవార్డులకు ఎంపికయ్యారు. మొత్తంగా అవార్డులు దక్కిన వారిలో 30 మంది మహిళలు, 8 మంది విదేశీయులు ఉన్నారు. మరణానంతరం 9 మందికి అవార్డులను ప్రకటించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను బీహార్ మాజీ సీఎం, జననాయక్ కర్పూరి ఠాకూర్ (మరణానంతరం)కు ఇటీవల కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే.

పద్మవిభూషణ్

1.వైజయంతీమాల బాలి (కళలు, తమిళనాడు)
2.కొణిదెల చిరంజీవి (కళలు, ఏపీ)
3.ఎం.వెంకయ్యనాయుడు (ప్రజా సంబంధాలు, ఏపీ)
4.బిందేశ్వర్ పాఠక్ (మరణానంతరం)–(సామాజికసేవ, బీహార్)
5.పద్మ సుబ్రహ్మణ్యం (కళలు, తమిళనాడు)

పద్మభూషణ్

1.ఎం.ఫాతిమా బీవీ (మరణానంతరం), రాష్ట్రం–కేరళ 2.హర్మస్‌జీ ఎన్ కామా, మహారాష్ట్ర 3.మిథున్ చక్రవర్తి, పశ్చిమ బెంగాల్ 4.సీతారాం జిందాల్, కర్ణాటక 5.యోంగ్ లు, తైవాన్ 6.అశ్విన్ బాలాచంద్ మెహతా, మహారాష్ట్ర 7.సత్యబ్రత ముఖర్జీ, పశ్చిమ బెంగాల్ 8.రామ్ నాయక్, మహారాష్ట్ర 9.తేజస్ మధుసూదన్ పటేల్, గుజరాత్ 10.ఒలిచెరి రాజగోపాల్, కేరళ 11.దత్తాత్రేయ అంబదాస్ మాయూలూ అలియాస్ రాజ్‌దత్, మహారాష్ట్ర 12.తోగ్డాన్ రింపోచ్, లడఖ్ 13.చంద్రేశ్వర్ ప్రసాద్ ఠాకూర్, బీహార్ 14.ఉషా ఉతప్, పశ్చిమ బెంగాల్ 15. విజయ్‌కాంత్ (మరణానంతరం), తమిళనాడు 16.కుందన్ వ్యాస్, మహారాష్ట్ర 17.ప్యారేలాల్ శర్మ

పద్మశ్రీకి ఎంపికైన వారిలో కొందరు...

- వేలు ఆనందచారి(కళలు– తెలంగాణ)
- దాసరి కొండప్ప(కళలు– తెలంగాణ)
- గడ్డం సమ్మయ్య(కళలు– తెలంగాణ)
- కేతావత్ సోమ్‌లాల్(సాహిత్యం, విద్య– తెలంగాణ)
- కూరెళ్ల విఠలాచార్య(సాహిత్యం, విద్య– తెలంగాణ)
- రోహన్ బోపన్న (క్రీడలు–కర్ణాటక)
- పర్బతి బారుహ(సామాజిక సేవ (దేశ తొలి మహిళా మావటి)–అస్సాం)
- స్మృతి రేఖ చక్మా (కళలు– త్రిపుర)

మొగల్తూరు నుంచి పద్మ విభూషణ్ దాకా

సినిమా డెస్క్, నమస్తే తెలంగాణ: అగ్ర నటుడు చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది. భారత ప్రభుత్వం అందించే రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్‌కు ఎంపికయ్యారు. అక్కినేని నాగేశ్వరావు, ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం తర్వాత ఈ పురస్కారాన్ని అందుకున్న మూడో వ్యక్తిగా చిరంజీవి చరిత్రకెక్కారు. 1978లో వచ్చిన 'పునాదిరాళ్లు'తో చిరంజీవి తన నట జీవితాన్ని ప్రారంభించారు. ఆయనకు 2006లో పద్మభూషణ్ అవార్డు దక్కింది. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో కమర్షియల్ సినిమాకు కొత్త భాష్యం చెప్పూ సంచలన విజయాలతో ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్నారు మెగాస్టార్. ఎన్టీఆర్ తర్వాత అంతటి మాస్ ఇమేజ్ సాధించుకున్న వ్యక్తి చిరంజీవి. సినిమాల్లో ఆల్ రౌండర్‌గా ఎదగడమే కాక ఓ ట్రెండ్ సెట్ చేశారాయన. అప్పటివరకున్న మూస ధోరణికి స్వస్తి పలికి సినిమాలకు కమర్షియల్ హంగులు అద్దారు. 47 సినిమాలు 100 రోజులు ఆడాయంటే ప్రేక్షక హృదయాల్లో ఆయన స్థానం ఎంత గొప్పదో చెప్పక్కర్లేదు. ప్రస్తుతం దర్శకుడు వశిష్టతో కలిసి చేస్తున్న 'విశ్వంభర' చిరంజీవికి 156వ సినిమా. 2006లో ఆంధ్ర యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. ఇంకా ఆయన ఖాతాలో రఘుపతి వెంకయ్య పురస్కారం (2016)తోపాటు 3 నందులు, 9 ఫిల్మ్‌ఫేర్ అవార్డులున్నాయి. ప్రజారాజ్యం పార్టీ స్థాపించి కాంగ్రెస్‌లో విలీనం చేశారు. కేంద్ర మంత్రిగా సేవలందించారు. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి బ్లడ్, ఐ బ్యాంక్‌ల ద్వారా సామాజిక సేవతో మానవత్వం చాటారు.

వెంకయ్యనాయుడు

1949 జూలై 1న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా చవటపాలెంలో జన్మించారు. 1972లో ఉద్ధృతంగా సాగిన జైఆంధ్ర ఉద్యమంతో వెలుగులోకి వచ్చారు. ఆయన నెల్లూరులో జరిగిన ఆందోళనలో చురుగ్గా పాల్గొన్నారు. 1999లో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా, 2014లో మోదీ మంత్రివర్గంలో కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2017 నుంచి 2022 వరకు భారత 13వ ఉప రాష్ట్రపతిగా పనిచేశారు. నెల్లూరులో 'స్వర్ణ భారత్ ట్రస్ట్'ను స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

వైజయంతిమాల

1933, ఆగస్టు 13న చెన్నైలోని తమిళ కుటుంబంలో జన్మించారు. నాట్య కళాకారిణిగా, సినీ నటిగా ఎన్నో అవార్డులు అందుకున్నారు. హిందీ దేవదాస్‌లో హీరోయిన్‌గా నటించారు. 1980లో ఎంపీగా ఎన్నికయ్యారు.

బిందేశ్వర్ పాఠక్

బీహార్‌లోని వైశాలిలో 1943 ఏప్రిల్ 2న జన్మించారు. సులభ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు. మరుగుదొడ్ల నిర్మాణంపై ఐదు దశాబ్దాలపాటు ఉద్యమించారు. పారిశుధ్య కార్మికుల పట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. గత ఏడాది ఆగస్టు 15న కన్నుమూశారు.

ప్రజాస్వామ్యానికి తల్లి భారత్

- **చరిత్రలో నిలిచిపోనున్న అయోధ్య రామమందిరం**
- **జాతినుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం**

న్యూఢిల్లీ, జనవరి 25: పాశ్చాత్య దేశాలతో పోల్చితే భారత ప్రజాస్వామ్యం ఎంతో పురాతనమైందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అందుకే భారత్‌ను ప్రజాస్వామ్యానికి తల్లి అని అంటారని పేర్కొన్నారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాష్ట్రపతి జాతినుద్దేశించి ప్రసంగించారు. గొప్ప మంది రంగా అయోధ్య రామాలయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రజల విశ్వాసాలే కాకుండా, న్యాయ ప్రక్రియపై ఎనలేని నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలు, హింస చెలరేగటంపై రాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. భయాలు, పక్షపాతాలు.. భరించలేని స్థాయిలో హింసకు దారితీశాయన్నారు. వర్ధమాన మహావీరుడు, మహాత్మాగాంధీ, అశోకుడి బోధనలు ఉటంకించిన రాష్ట్రపతి.. త్వరలోనే శాంతియుత పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లుతో ప్రభుత్వ పాలన మరింత మెరుగుపడుతుందని, మహిళా సాధికారతలో విప్లవాత్మక మార్పుకు నాంది అవుతుందని రాష్ట్రపతి అన్నారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారత కీర్తి పతాకాన్ని ఎగురవేయటంలో మహిళా అథ్లెట్స్ కీలక పాత్ర పోషిస్తున్నారని ముర్ము అన్నారు. ఆసియా క్రీడల్లో భారత్ 107 మెడల్స్ సాధించగా, అందులో మహిళా అథ్లెట్స్ 46 పథకాలు అందుకున్నారని ప్రశంసించారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ సాంకేతిక పురోగతి దైనందిన జీవితాల్లో భాగమవుతున్నాయని చెప్పారు. వీటిలో ఆందోళన కలిగించే అంశాలు ఉన్నా.. యువతకు అనేక కొత్త అవకాశాలు సృష్టిస్తున్నాయని ముర్ము చెప్పారు.

ఆరుగురికి కీర్తి చక్ర

న్యూఢిల్లీ, జనవరి 25: విధి నిర్వహణలో శౌర్య పరాక్రమాలు ప్రదర్శించిన వీరులకు భారత ప్రభుత్వం 80 శౌర్య అవార్డులను ప్రకటించింది. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వీటికి ఆమోదం తెలిపారు. వీరిలో ఆరుగురిని కీర్తి చక్ర, 16 మందిని శౌర్యచక్ర అవార్డులకు ఎంపిక చేశారు. కీర్తి చక్రలో ముగ్గురికి, శౌర్య చక్రలో ఇద్దరికి మరణానంతరం అవార్డులను ప్రకటించారు. అశోకచక్ర తర్వాత రెండో అత్యున్నత శౌర్య పురస్కారం కీర్తి చక్ర కాగా, మూడోది శౌర్య చక్ర.

కీర్తిచక్ర: కీర్తి చక్ర అవార్డు పొందిన వారిలో ప్యారాచూట్ రెజిమెంట్ 21వ బెటాలియన్‌కు చెందిన దిగ్విజయ్ సింగ్ రావత్, సిక్కు రెజిమెంట్ నాలుగో బెటాలియన్‌కు చెందిన మేజర్ దీపేంద్ర విక్రమ్ బాస్నెట్, మహర్ రెజిమెంట్ 21వ బెటాలియన్‌కు చెందిన హవల్దార్ పవన్ కుమార్ యాదవ్ ఉన్నారు. అలాగే మరణానంతరం ఈ అవార్డు పొందిన వారిలో కెప్టెన్ అన్షుమన్ సింగ్, హవల్దార్ అబ్దుల్ మజీద్, సిపాయి పవన్ కుమార్ ఉన్నారు.

శౌర్య చక్ర: శౌర్య చక్ర అవార్డు పొందిన వారిలో మేజర్ మనియా ఫ్రాన్సిస్, మేజర్ అమర్ దీప్ జక్కర్, నాయబ్ సుబేదార్ బరియా సంజయ్ కుమార్ భామర్ సింగ్, హవల్దార్ సంజయ్ కుమార్, పర్షోత్తమ్ కుమార్, బిమల్ రంజన్ బెహ్రా, శైలేష్ సింగ్, హృషికేశ్ జయన్ కరుతేదత్, బిబ్లర్ కుమార్ సింగ్, మోహన్ లాల్, అమిత్ రైనా, ఫరోజ్ అహ్మద్ దార్, వరుణ్ సింగ్ ఉన్నారు. మరణానంతరం శౌర్యచక్ర లభించిన వారిలో కెప్టెన్ ఎంవీ ప్రాంజల్, అలోక్ రావు ఉన్నారు. అలాగే 53 సేనా పతకాలు (ఏడుగురికి మరణానంతరం), ఒక నావో సేనా పతకం, నాలుగు వాయుసేన పతకాలు కూడా ప్రకటించారు.

1,132 మందికి పోలీస్ పతకాలు

గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కేంద్రం పోలీస్ పతకాలను ప్రకటించింది. 1,132 మందికి శౌర్య, సేవా పతకాలను అందజేయనుంది. పోలీసు, అగ్నిమాపక దళం, హోం గార్డ్స్, సివిల్ డిఫెన్స్, కరక్షనల్ సర్వీస్‌లలో పని చేస్తున్నవారికి ఈ పతకాలు లభించాయి. తెలంగాణ నుంచి 22 మందికి పతకాలు దక్కాయి.



ఇండియా కూటమి కకావికలం

- **కాంగ్రెస్ తీరుతో భాగస్వామ్య పార్టీలు బేజారు**
- **ఒంటరిగానే బరిలోకి దిగుతా మన్న తృణమూల్, ఆప్**
- **తాజాగా కూటమికి గుడ్‌బై చెప్పిన నితీశ్‌కుమార్!**
- **కేరళ లోనూ కాంగ్రెస్‌కు హ్యాండిచ్చిన వామపక్షాలు**

న్యూఢిల్లీ, జనవరి 25: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ఏర్పాటైన ఇండియా కూటమి కకావికలమవుతున్నది. కాంగ్రెస్ పార్టీ తీరుతో భాగస్వామ్య పక్షాలు ఒక్కొక్కటిగా కూటమిని వీడుతున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో ఒంటరిగానే బరిలోకి దిగుతామని తృణమూల్ కాంగ్రెస్, ఆ రాష్ట్ర సీఎం అధినేత మమతా బెనర్జీ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. పంజాబ్‌లో అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీచేస్తామని ఆప్ నేత, సీఎం భగవంత్ సింగ్ మాన్ ప్రకటించారు. తాజాగా జేడీయూ అధినేత, బీహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా కూటమిని వీడటం దాదాపు ఖాయమైంది. ఆయన తిరిగి ఎన్డీయే కూటమిలో చేరనున్నట్టు తెలుస్తున్నది.

దీదీ ఒంటరిగానే..

బెంగాల్‌లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్ర మమతా బెనర్జీ బుధవారమే ప్రకటించారు. ఒక పక్క సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించగా, తనతో సీట్ల గురించి ఏ కాంగ్రెస్ నేత చర్చించలేదంటూ మమతా బెనర్జీ కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ సొంతంగా 300 సీట్లలో పోటీ చేయనివ్వండి. బెంగాల్‌లో మాత్రం ఆ పార్టీతో పొత్తును ఎంతమాత్రం అంగీకరించమని ఆమె తేల్చిచెప్పారు. అలాగే రాహుల్ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర బెంగాల్ షెడ్యూల్ గురించి తనకెవరూ సమాచారమివ్వలేదని ఆమె మండిపడ్డారు. ఎన్నికల తర్వాతే పొత్తుపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టంచేశారు.

బీజేపీవైపు నితీశ్ చూపులు

కూటమిలోనే ప్రధాన నేతల్లో ఒకరైన బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఇప్పుడు బీజేపీ వైపు చూపులు చూస్తుండటం కూటమికి పెద్ద దెబ్బేనని భావించవచ్చు. అదే జరిగితే బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ, లాలూ ప్రసాద్‌కు చెందిన ఆర్జేడీలు మాత్రమే కూటమిలో నిలుస్తాయి. ఒక వేళ నితీశ్ కూటమిలో కొనసాగినా ఆర్జేడీ, జేడీయూలు చెరో 17 సీట్లు పంచుకుంటాయని భావిస్తున్నారు.

కేరళలో..

కాంగ్రెస్‌కు అధికార సీపీఎం హ్యాండిచ్చింది. అక్కడ సీపీఎంతో కాంగ్రెస్‌కు సీట్ల సర్దుబాటు అసాధ్యమని కాంగ్రెస్ నేత శశి థరూర్ వ్యాఖ్యానించారు.

అఖిలేశ్ గరం గరం

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ధర్మాన్ని పట్టించుకోకపోవడంపై ఇప్పటికే పలుసార్లు ధ్వజమెత్తిన ఎస్పీ నేత అఖిలేశ్ యాదవ్ కాంగ్రెస్‌తో ఎంతవరకు కలిసి వస్తారన్నది ప్రశ్న.

మహారాష్ట్రలోనూ అంతే

సార్వత్రిక ఎన్నికల్లో శివసేన (యూబీటీ) రాష్ట్రంలోని మొత్తం 48 సీట్లలో 23 చోట్ల పోటీ చేస్తుందని ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ పునరుద్ఘాటించారు. అదే కనుక జరిగితే మహావికాస్ అఘాడి (ఎంవీఏ)లో ఉన్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, శరద్ పవార్ ఎన్సీపీ మిగిలిన 25 సీట్లను పంచుకోవాలి.

అధిర్ వల్లే పొత్తు చెడింది: ఓబ్రియన్

పశ్చిమబెంగాల్‌లో తాము ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించడానికి అసలు కారకుడు కాంగ్రెస్ లోక్‌సభా పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి అని తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓబ్రియన్ చెప్పారు.

మళ్లీ బీజేపీ వైపు నితీశ్ చూపు?

కూటమి మారే యోచనలో బీహార్ సీఎం

ఆర్జేడీతో విభేదాలే కారణం • కూటములు మార్చడం నితీశ్‌కు ఐదోసారి

స్వాగతించేందుకు కమలం పార్టీ సిద్ధం • జేడీయూను చీల్చేందుకు లాలూ ఎత్తులు



న్యూఢిల్లీ, జనవరి 25: ఏ పార్టీతోనూ లేదా ఏ కూటమిలోనూ ఎక్కువ కాలం కొనసాగని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ నాయకుడు నితీశ్‌కుమార్ మరోసారి తన పాత మిత్రులవైపు అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. కాంగ్రెస్‌తో జట్టుకట్టిన నితీశ్ గత రెండు మూడేండ్లుగా బీజేపీకి వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిని ఏర్పాటుచేయడంలో కీలకంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఆయన మళ్లీ బీజేపీ వైపు మొగ్గుతున్నట్టు సమాచారం. ఇండియా కూటమిలోని ఆర్జేడీతో ఏర్పడిన విభేదాల నేపథ్యంలో నితీశ్ తిరిగి బీజేపీ పంచన చేరాలని నిర్ణయించుకున్నట్టు చెప్తున్నారు. 'గాలి తన దిశను మార్చుకున్నట్టు నితీశ్ తన విధానాలను మార్చుకోవడం సహజమే' నంటూ ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య శుక్రవారం ట్వీట్ చేశారు. ఇక ఇంతకాలం నితీశ్‌ను ఎట్టిపరిస్థితిల్లోనూ తమ దరిదాపుల్లోకి రానివ్వబోమని బీరాలు పలికిన బీజేపీ నేతలు ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. బీజేపీ బీహార్ నేతలు నితీశ్ రాకను వ్యతిరేకిస్తుండగా, జాతీయ నాయకులు మాత్రం ఇప్పటికే ఆయన పట్ల తమ సానుకూలతను వ్యక్తం చేసినట్టు తెలుస్తున్నది. గతంలో జరిగిన చేదు అనుభవాలను బట్టి కాకుండా తమ భవిష్యత్తు రాజకీయ ప్రయోజనాల ఆధారంగా తమ పార్టీ నడుచుకుంటుంది అని ఓ బీజేపీ నాయకుడు చేసిన వ్యాఖ్య.. నితీశ్ పట్ల ఆ పార్టీ సానుకూలతను వ్యక్తం చేస్తున్నది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం నితీశ్ పట్ల సానుకూలంగా స్పందించారు. జనతాదళ్ (యూ) అధ్యక్షుడు తిరిగి బీజేపీ కూటమిలో చేరే అవకాశాలున్నాయా అన్న ప్రశ్నకు అమిత్‌షా స్పందిస్తూ.. అటువంటి ప్రతిపాదన ఏదైనా వస్తే తమ పార్టీ తప్పనిసరిగా పరిశీలిస్తుందని స్పష్టం చేశారు. నితీశ్‌కు తలుపులు మూసేశాం అని గతంలో ప్రకటించిన అమిత్‌షా ఇప్పుడు తన వైఖరిని మార్చుకోవడం బీజేపీలో చర్చనీయాంశమైంది.

నితీశ్‌కు ఇది మామూలే

కొంతకాలం ఆర్జేడీ–కాంగ్రెస్–లెఫ్ట్ కూటమితో కొనసాగడం, ఆ తరువాత వెంటనే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోకి దూకడం నితీశ్‌కు నీళ్ల తాగినంత పని. బెట్టియాలో వచ్చే నెల 4న జరుగనున్న బహిరంగ సభలో ప్రధాని మోదీతో కలిసి నితీశ్ వేదికను పంచుకోనున్నారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. పార్టీ ఎమ్మెల్యేలతో పాట్నాలో సమావేశమైన నితీశ్ తన నిర్ణయాన్ని వెల్లడించినట్టు తెలుస్తున్నది. ముందుగా ఆయన సీఎం పదవికి రాజీనామా చేస్తారని ఆ తరువాత బీజేపీ, జేడీయూ ఏర్పరుస్తారని జేడీయూ వర్గాలు పేర్కొన్నాయి. కొత్త క్యాబినెట్ ఏర్పడిన తరువాత అసెంబ్లీని రద్దుచేసి ఎన్నికలకు వెళ్లే యోచనలో నితీశ్ ఉన్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి.

ఆర్జేడీతో పొసగక..

తన స్థాయికి, హోదాకు తగిన స్థానం ఇండియా కూటమిలో దక్కకపోవడం, లోక్‌సభతోపాటే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలన్న ఆయన ప్రతిపాదనకు ఆర్జేడీ మద్దతునివ్వకపోవడంతో నితీశ్ కినుక వహించినట్టు తెలుస్తున్నది. ఇటీవలి కాలంలో బీహార్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆర్జేడీ తమ నాయకుడిని పరిపాలనలోనూ, రాజకీయ రంగంలోనూ తక్కువ చేసి చూస్తున్నదని నితీశ్ మద్దతుదారులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జేడీయూ అధ్యక్షునిగా ఉన్న లలన్‌సింగ్ పదవీకాలం పూర్తికాకుండానే అతడిని దించేసిన నితీశ్ తిరిగి పార్టీ పగ్గాలు అందుకున్నారు. నితీశ్‌కు ఎంతో నమ్మకస్తునిగా ఉన్న లలన్‌సింగ్ ఇటీవలి కాలంలో ఆర్జేడీకి చేరువయ్యాడని లేదా పార్టీలో తన సొంత ఎజెండాను అమలుచేస్తున్నాడన్న అనుమానంతోనే అతడిని అధ్యక్ష పదవినుంచి తొలగించినట్టు చెప్తున్నారు.

కూటమి మార్చడం ఐదోసారి

నితీశ్ 2013 నుంచి ఇలా కూటములు మార్చడం ఇది ఐదోసారి. ఆర్జేడీ–కాంగ్రెస్–లెఫ్ట్ పార్టీల కూటమితో కొనసాగిన నితీశ్ 2015 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై ఘన విజయం సాధించారు. కానీ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కొద్ది రోజులకే తిరిగి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరి 2019 లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందారు. ఇక 2020 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టినప్పటికీ అన్ని విషయాలలో బీజేపీదే పై చేయి కావడంతో మళ్లీ ఆ కూటమిని వదిలేసి 2022లో ఆర్జేడీ పంచన చేరి పదవిని నిలబెట్టుకున్నారు. తాజా పరిణామాలతో నితీశ్‌పై అటు బీజేపీలో, ఇటు స్వపక్షంలో కూడా విమర్శల దాడి తీవ్రమవుతున్నది. నితీశ్ ఒక రాజకీయ శక్తిగా పతనమవుతున్నారని, తన పరువును దిగజార్చుకుంటున్నారు అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనుండగా నితీశ్ నిర్ణయం ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందోనన్న ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి.

పావులు కదుపుతున్న లాలూ

ఇండియా కూటమిలో నుంచి నితీశ్‌కుమార్ నేతృత్వంలోని జేడీయూ వైదొలగితే.. బీహార్‌లో ప్రభుత్వం కుప్పకూలుతుంది. నితీశ్ తన ఎమ్మెల్యే లందరినీ కాపాడుకుంటూ బీజేపీతో మళ్లీ జట్టుకడితే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచగలుగుతారు. మరోవైపు జేడీయూ నుంచి ఓ ఎనిమిది మంది ఎమ్మెల్యేలను తనవైపు లాక్కొని ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జేడీ పావులు కదుపుతున్నది. బీహార్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 122.. కాగా ఆర్జేడీకి కాంగ్రెస్‌తో పాటు లెఫ్ట్ పార్టీలు మద్దతునిస్తున్నాయి. ఈ మూడు పార్టీలకు కలిపి (ఆర్జేడీ 79, కాంగ్రెస్ 19, లెఫ్ట్ 16) 114 సీట్లు ఉన్నాయి. జీతన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హెచ్ఏం పార్టీకి 4, మజ్లిస్‌కు ఒకటి, ఇండిపెండెంట్ ఒకరు ఉన్నారు. వీరు కూడా ఆర్జేడీ వైపు మొగ్గు చూపే అవకాశాలున్నట్టు పరిశీలకులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ మరో ఇద్దరి మద్దతు అవసరమవుతుంది. అలా కాకుండా మొత్తంగా జేడీయూను చీల్చడంపైనే ఆర్జేడీ తన దృష్టిని కేంద్రీకరించినట్టు తెలుస్తున్నది.

నితీశ్‌పై ఘాటు వ్యాఖ్యలు.. లాలూ కుమార్తె క్షమాపణ చెప్పాలి: బీజేపీ

పాట్నా, జనవరి 25: బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌పై మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణీ ఆచార్య చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆ రాష్ట్ర బీజేపీ గురువారం డిమాండ్ చేసింది. సింగపూర్‌లో ఉంటున్న రోహిణి అమర్యాదకర భాషను ఉపయోగించి ఎక్స్‌లో కొన్ని పోస్టులు చేసి, అనంతరం తొలగించారని బీహార్ బీజేపీ నేత నిఖిల్ అహ్మద్ ఆరోపించారు. కాగా, బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్‌కు కేంద్రం భారత రత్న ప్రకటించిన సందర్భంగా బుధవారం ఆయన జయంతి ఉత్సవాల్లో నితీశ్ వారసత్వ రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఠాకూర్ బాటలోనే తమ పార్టీ పయనిస్తూ కుటుంబ సభ్యులెవరికీ ఎలాంటి పదవులు కేటాయించడం లేదని ఆయన పరోక్షంగా లాలూ కుటుంబాన్ని ఉద్దేశించి విమర్శించారు. దానిపై రోహిణి ఆచార్య నితీశ్‌పై ఎక్స్‌లో ఘాటు వ్యాఖ్యలు చేసి, అనంతరం వాటిని తొలగించారు.

తిరిగి బీజేపీ గూటికి మాజీ సీఎం శెట్టర్

న్యూఢిల్లీ, జనవరి 25: టికెట్ రాలేదన్న కారణంతో కర్ణాటక శాసనసభ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన ఆ రాష్ట్ర మాజీ సీఎం జగదీశ్ శెట్టర్ గురువారం తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. చాలా మంది తన శ్రేయోభిలాషులు తాను తిరిగి బీజేపీలోకి రావాలని కోరుకున్నారని.. కమలం పార్టీతో తనది సుదీర్ఘ అనుబంధమని ఈ సందర్భంగా శెట్టర్ తెలిపారు. కర్ణాటక మాజీ సీఎం యెడియూరప్ప, కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ సమక్షంలో ఆయన గురువారం బీజేపీ కండువా కప్పుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసిన తర్వాత ఆయన బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. లింగాయత్ నాయకుడైన శెట్టర్ ఎన్నికల్లో ఓడిపోయినా ఎమ్మెల్సీ పదవి వరించింది. అయితే సొంత గూటిని చేరుకోవడం కోసం ఆయన ఎమ్మెల్సీ పదవిని వదులుకున్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం బలపడుతున్నదని శెట్టర్ ప్రశంసించారు.

మమ అనిపించిన కేరళ గవర్నర్

అసెంబ్లీలో 2 నిమిషాలే ప్రసంగం

తిరువనంతపురం: కేరళ అసెంబ్లీలో ఆ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ కేవలం 2 నిమిషాల్లోపే తన ప్